రైతులు ఆందోళన చెందొద్దు

• ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


పంటను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట: వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో సోమవారం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టాన్ని తక్షణమే అంచనా వేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా మోసం చేసిందన్నారు. విప్ వెంట తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ఏడీఏ రామారావు, మండల వ్యవసాయాధికారి సందీప్, ఏఈవోలు సహజ, రమేశ్, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, వైస్‌చైర్మన్ ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సెలవులో వెళ్లిన కీలక అధికారులు



ఎస్.భీమ్యానాయక్, అదనపు కలెక్టర్ | రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ


సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

సిరిసిల్ల: జిల్లాలో కీలకమైన అధికారులు సెలవులో వెళ్లారు. అదనపు కలెక్టర్ ఎస్. భీమ్యానాయక్ రెండురోజుల కిందటే సెలవు పెట్టారు. ఆయన సతీమణి అనారోగ్య కారణాలతో అదనపు కలెక్టర్ సెలవులో వెళ్లినట్లు భావిస్తున్నారు. వేములవాడ ఆ ర్డీవో రాజేశ్వర్ కూతురు పెళ్లి కా రణంగా సెలవులో వెళ్లగా.. సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవోగా ఉన్న ప్రత్యేక ఉప కలెక్టర్ రాధాబాయికి వేములవాడ ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తా జాగా సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సైతం సెలవు పెట్టారు. కలెక్టరేట్‌కు వెళ్లి దీర్ఘకాలిక సెలవుకు దరఖాస్తు చేసి వెళ్లినట్లు సమాచారం. సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా డీఈఈగా పని చేస్తున్న పి.వాణికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కాగా, ఆమె బాధ్యతలు తీసుకునేందుకు నిరాకరించినట్లు సమాచారం. ముగ్గురు అధికారులు వేర్వేరు కారణాలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశమైంది. అయితే, అధికారులు సెలవు పెట్టేందుకు మరేదైనా కారణం ఉందా..? అని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఆరా తీస్తున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


కోనరావుపేట: నిమ్మపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ కోరారు. మండలంలోని నిమ్మపల్లిలోని ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యం నిల్వలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యం నిల్వలను వెంటనే కొనుగోలు చేయకపోవడం వల్లే అకాలవర్షానికి నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు బడుగు రాములు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఆయనవెంట మండల అధ్యక్షుడు మిర్యాలకార్ బాలాజీ, నాయకులు గొట్టె రామచంద్రం, మోత్కు మోహన్, నాగరాజు, పల్లం అన్నపూర్ణ, జితేందర్ రెడ్డి, కాసర్ల మల్లేశం, దుర్గం దిలీప్, గొట్టె ఎల్లం, తిరుపతి, వికాస్, జిన్న అనిల్, పిల్లి వెంకటి, చంద్రం, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్రశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు నకిలీ ఏజెంట్ల అరెస్ట్

ఇల్లంతకుంట(మానకొండూర్): విదేశాలకు పంపిస్తానని మోసం చేసిన ఇద్దరు నకిలీ ఏజెంట్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా ధరిపల్లి మండలానికి చెందిన చెందిన బుర్ర నర్సాగౌడ్ కజకిస్తాన్ పంపిస్తానని ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన రేగుల మోహన్, బోయినపల్లి మండలానికి చెందిన పోలే తిరుపతి నుంచి రూ.3.55 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఇరువురికి వీసా, ఫ్లైట్ టికెట్లు అప్పజెప్పగా వారు ఢిల్లీకి వెళ్లి పరీక్షించుకోగా నకిలీవని తేలాయి. దీంతో తమ డబ్బులు ఇవ్వాలని నర్సాగౌడ్‌ను బాధితులు కోరగా, ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుర్ర నర్సాగౌడ్‌ను విచారించగా, తనతోపాటు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన నాడెం నరసయ్య కూడా ఇందులో బాధ్యుడని పేర్కొనగా ఇరువురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.




అకాలవర్షం.. తడిసిన ధాన్యం

రుద్రంగి: మండలకేంద్రంలో మంగళవారం కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. ఈదురుగాలులకు కోతకు వచ్చిన వరిపొలాలు నేలవాలాయని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

• **తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు**

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్, నాగంపేట, గజసింగవరం, లక్ష్మీపూర్ తండాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసంచేసి 14 లీటర్ల గుడుంబా, రెండు కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నాటుసారాయి తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నాటుసారాయి తయారు చేస్తున్నట్లు అనుమానితులుగా మరో ఎనిమిది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్సై శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

• **వేసవి జాగ్రత్తలపై అవగాహన**

ఎల్లారెడ్డిపేట: వేసవి దృష్ట్యా ఉపాధిహామీ కూలీలు, రైతులు వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో మంగళవారం ఉపాధిహామీ పనిస్థలం, గ్రామపంచాయతీ వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జిల్లా టీమ్ లీడర్ గడ్డం శ్రీనివాస్, కళాకారులు రామచంద్రం, శ్రీధర్‌రెడ్డి, పర్శరాములు, గణేశ్ పాల్గొన్నారు.

• **ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య**

ముస్తాబాద్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రేణుక, ఉపాధ్యాయులు సుల్తానా, మహేశ్, సీహెచ్ రాధిక, జి.దీప్తి, కవిత, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

• **అరాచకాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు**

తంగళ్లపల్లి: ఇందిరమ్మ రాజ్యం అంటూ మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు ఆరోపించారు. బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రియాంకపై గ్రామ కాంగ్రెస్ నాయకులు జులుం చేయడాన్ని ఖండించారు. కార్యదర్శి లేఖరాసి అదృశ్యం కావడంపై ఆవేదన వ్యక్తంచేశారు. కార్యదర్శులపై కాంగ్రెస్ నాయకులు అధికారం ప్రదర్శిస్తూ దూషించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు.

• **దత్త ఆలయానికి నీటి సౌకర్యం**

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై శ్రీ గురు దత్తాత్రేయస్వామి ఆలయానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాలతో నీటి సౌకర్యం కోసం మంగళవారం బోరువేసే పనులు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. నాయకులు గొట్ల వెంకటేశం, ఆడెపు రాజు, పీచర మాధవరావు, నిట్టు వెంకటేశం తదితరులు ఉన్నారు.

• **యువకుడికి గాయాలు**

చందుర్తి: రోడ్డుపై ధాన్యం కుప్పల వద్ద ఉన్న రాళ్లు తగిలి బైక్ అదుపు తప్పడంతో మంగళవారం రాత్రి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పిట్టల మల్లేశం చందుర్తి నుంచి మోతుకులరావుపేట వైపు వెళ్తుండగా, చందుర్తి శివారు కట్ట ప్రాంతంలోకి చేరగానే ధాన్యపు రాశుల వద్ద ఉన్న రాళ్లు తగలగా బైక్‌పైనుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలుకాగా 108లో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

సైజింగ్ కార్మికుల కూలి ఒప్పందం

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమలోని సైజింగ్ కార్మికుల ఒప్పందం ప్రకారం కూలి రేట్లు ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నట్లు సైజింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ సురేశ్, కార్యదర్శి గాజుల రవి తెలిపారు. సైజర్ వేతనం రూ.8,650 నుంచి రూ.9,550, బ్యాక్ సైజర్ రూ.8,425–రూ.9,236, ఫైర్‌మెన్ రూ.8,425– రూ.9,235, కోల్‌మెన్ రూ.8,425– రూ.9,235, వార్పర్ రూ.8,500–రూ.9,400, హెల్పర్ రూ.7,800– రూ.8,500 పెంచినట్లు పేర్కొన్నారు. సైజింగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సైజింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కిశోర్, కార్యవర్గ సభ్యులు, కార్మికులతో కలిసి ఒప్పందం జరిగిందని, రెండేళ్ల పాటు ఇదే కూలి అమలుచేయడం జరుగుతుందన్నారు.

బాలికల హాస్టల్ నిర్మాణానికి నిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గతంలో విప్ ఆది శ్రీనివాస్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినులు కళాశాలలో హాస్టల్ వసతి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, హాస్టల్ నిర్మాణం చేయాలని వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన విప్ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టవాల్సిందిగా కోరగా తక్షణమే స్పందించి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. హాస్టల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

సిరిసిల్లటౌన్: పట్టణ శివారులోని రైతులకు సెస్ అధికారులు రానున్న వర్షాకాలంలో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. సెస్ వినియోగదారులు అందరు విద్యుత్ వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సెస్ డీఈఈ, ఏఈ, రైతులు పాల్గొన్నారు.

యాదవుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

గంభీరావుపేట: యాదవుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమిద్దామని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్ అన్నారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను మండల యాదవ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల యాదవ సంఘం నాయకులు పెద్దవేని వెంకటి, మల్లేశం, కృష్ణకాంత్ యాదవ్ కృష్ణమూర్తి యాదవ్, శ్రావణ్‌యాదవ్, దేవయ్య, కోట రవి, రాజు, నాగరాజు, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: వేములవాడరూరల్ మండలం వట్టెంల నుంచి మండలంలోని అనంతపల్లికు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ మంగళవారం తెలిపారు. అనంతపల్లి పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా వట్టెంలకు చెందిన సయ్యద్ అలీ, ఎండీ. చిన్న మదర్ ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయడంతో పాటు, ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై పృథ్వీధర్ హెచ్చరించారు.

చలివేంద్రంలో నీటి కుండల ఏర్పాటు


రంజన్లలో నీరు నింపుతున్న పంచాయతీ సిబ్బంది

గంభీరావుపేట: మండల కేంద్రంలోని బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులు కుండలు ఏర్పాటు చేసి నీటిని నింపారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన చలివేంద్రం నిర్వహణపై నిర్లక్ష్యం కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వెంటనే పక్కన బోర్లించిన కుండలను తిరిగి సరిచేసి వాటిని నీటితో నింపి ప్రజలకు నీటిని అందిస్తున్నారు.

సాక్షి స్పందన

క్లుప్తంగా

రేపు సిరిసిల్ల సెస్ మహాసభ

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) 51వ మహాసభ గురువారం సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన జరుగుతుందని 'సెస్' ఎండీ విజయేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ మహాసభకు జిల్లాలోని అన్ని గ్రామాల సెస్ గ్రామ ప్రాతినిధ్య సభ్యులు, పాలకవర్గ సభ్యులు హాజరు కావాలని 'సెస్' ఎండీ కోరారు.

నేడు అవగాహన

వేములవాడరూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం జరగనుంది. వేములవాడ మండలంలోని హన్మాజిపేట రైతువేదికలో రూరల్ మండలంలోని అన్నిగ్రామాల ప్రజలకు బుధవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరుకానున్నట్లు వేములవాడరూరల్ తహసీల్దార్ అబుబాకర్ తెలిపారు.

ఘనంగా అఖండ కలశపూజ


అఖండ కలశంతో మహిళలు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేట భక్తాంజనేయ స్వామి ఆలయంలో గాయత్రీ పరివార్ (హరిద్వార్) ఆధ్వర్యంలో అఖండ కలశపూజ నిర్వహించారు. కలశంతో గ్రామవీధుల గుండా తిరుగుతూ ఆలయంలో వైభవంగా గాయత్రీ మహాయజ్ఞ పూజా కార్యక్రమంనిర్వహించారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపురం, జంగారెడ్డిపల్లి, రహీంఖాన్‌పేట, అనంతారం, గ్రామాల్లో జై బాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, గుడిసె ఐలయ్య, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, మంద బాల్‌రెడ్డి, బత్తిని నారాయణ, తీగల పుష్పలత, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి, పాశం రాజేందర్‌రెడ్డి, పసుల వెంకటి, కేతిరెడ్డి నవీన్ ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. రైతన్న ఆగ్రహం


రోడ్డుపై ధాన్యం పోసి ధర్నా చేస్తున్న రైతులు

గంభీరావుపేట: యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకం వేసిన వడ్లను రైసుమిల్లులకు తరలించడంలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతూ ఆందోళనకు దిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలకేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని రైతులు మంగళవారం సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ధాన్యం పోసి రాస్తారోకో నిర్వహించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతే తమకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యం సంచులు కుప్పలుతెప్పలుగా కేంద్రంలోనే ఉండడంతో వేరే రైతులు ఆరబెట్టుకోవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి లారీలను సమకూర్చి, రైసుమిల్లులకు ధాన్యం వెంటనే తరలించాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రేమానంద్, ఆర్‌ఐ గోపి రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఉచిత వైద్యశిబిరం

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత అయుర్వేదిక్ వైద్య శిబిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

స్వర్ణకారుల ఉపాధిని దెబ్బతీయొద్దు

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఇతర రాష్ట్రాల జ్యువెల్లరీ దుకాణాలకు అనుమతులు ఇచ్చి స్థానికంగా ఉన్న స్వర్ణకారుల ఉపాధిని దెబ్బతీయొద్దని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య డిమాండ్ చేశారు. మండల స్వర్ణకారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. నెలరోజులుగా ఈ విషయమై అధికార కాంగ్రెస్ పార్టీ బాధ్యులు, అధికారులకు తెలిపామన్నారు. జ్యువెల్లరీ దుకాణాలు ప్రారంభిస్తే దీక్షలు చేపడుతామన్నారు. ఈ మేరకు తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, వెంకటేశం, విశ్వనాథం, అనిల్, శ్రీనివాస్, బ్రహ్మం, సతీశ్‌వి, లక్ష్మణ్, సంతోష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అపెరల్ పార్క్ గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలి

• కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో రైతులకు ఇబ్బంది కలగకుండా కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వడ్లను వేగంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. రైస్ మిల్లులు అలాట్‌మెంట్ కానీ ప్రాంతాల ధాన్యాన్ని అపెరల్ పార్క్‌లోని గోదాములకు తరలించాలన్నారు. ప్రతీ కేంద్రం వద్ద రెండు లారీలు అందుబాటులో ఉండేలా చూడాలని, రవాణా, గోదాములు ఖాళీ లేని కారణంగా కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని సూచించారు. జిల్లాలో 241 కేంద్రాలకు 239 కేంద్రాలను ప్రారంభించి, 198 కేంద్రాల్లో 16,022 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీఏఓ అఫ్జల్‌బేగం, డీసీవో రామకృష్ణ, డీఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

• జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత


ఆరోగ్య కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి రజిత

తంగళ్లపల్లి: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రజిత అన్నారు. మంగళవారం చీర్లవంచ, నేరెళ్ల పీహెచ్‌సీ, లక్ష్మీపూర్, జిల్లెల్ల ఆరోగ్య ఉపకేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 29వరకు ప్రత్యేక వ్యాధి నిరోధ టీకాల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్లు, వ్యాధి నిరోధక ప్రతికూల ప్రభావాల కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. డీఐవో డా.సంపత్ కుమార్, వై.నవీన, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే విశ్వకర్మలకు న్యాయం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

వేములవాడ : గత ప్రభుత్వాలు విశ్వకర్మలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వకర్మలకు న్యాయం చేస్తుందని విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాలచారి అన్నారు. పట్టణంలో అఖిల భారత విశ్వకర్మ పరిషత్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ వృత్తి రీత్యా ఉపయోగించే పరికరాలకు గత ప్రభుత్వం విద్యుత్‌పరంగా ఐదు హెచ్‌పీలు ఉచితంగా ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 25 హెచ్‌పీల వరకు పెంచి విశ్వకర్మలను గుర్తించిందన్నారు. విశ్వకర్మలకు సొసైటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెల్డింగ్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మ్యాదరం రవీందర్, కోశాధికారి స్తంభంపల్లి సత్యనారాయణ, సెక్రెటరీ స్తంభంపెల్లి రమేశ్, కొడుముంజ శ్రీనివాస్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి


వేములవాడ రూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడరూరల్: ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ సభకు ప్రతీ కార్యకర్త హాజరై విజయవంతం చేద్దామని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పిలుపునిచ్చారు. మండలంలోని మల్లారంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ స్థాపించి 25 ఏళ్లు కావస్తున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. అనంతరం సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గొస్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి కోరారు. మండలకేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. నాయకులు ఎద్ల సందీప్, ఎలగందుల నర్సింలు, పర్శరాములు గౌడ్, అనసూయ, పందిర్ల నాగరాణి, హసన్, మీ సం రాజం, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మాజీ సర్పంచ్ నల్లనర్సయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అన్వర్, సందుపట్ల చిన్న అంజిరెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై ఇంటర్వ్యూలు


ముస్తాబాద్: ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

ముస్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం పథకానికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో బీరయ్య తెలిపారు. 3వేల మందికిపైగా యువత దరఖాస్తులు చేసుకున్నారన్నారు. నామాపూర్, మోహినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లె అభ్యర్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు తీసుకున్నారన్నారు. మేనేజర్లు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తుదారుల పత్రాలను ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈనెల 29 వరకు గ్రా మాలవారీగా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నా రు. సూపరింటెండెంట్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న ఎస్టీ కార్పొరేషన్ వారికి గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయములో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ వాజిద్ మంగళవారం తెలిపారు.


ఎల్లారెడ్డిపేట: మండలంలో రాజీవ్‌యువ వికాసం పథకం కింద మంజూరైన వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల 30 వరకు మండల పరిషత్ ఆఫీస్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థినికి గ్రాడ్యుయేషన్ పత్రాలు అందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలు అందించారు. ఎంఈవో కృష్ణహరి మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నేవూరి మానస, ఉపాధ్యాయులు నరేశ్, రజిత, ప్రశాంత్‌కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరేందర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌కు చెందిన యువకుడు గడ్డి నరేందర్ (28) చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం రాత్రి నరేందర్ ఎల్లారెడ్డిపేటలోని ఓ వివాహిత ఇంటివద్దకు వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో నరేందర్‌ను పోలీసులు 108 వాహనంలో తొలుత సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు ఓ వివాహితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.